క్లుప్తంగా

నేడు ఎంపీ, ఎమ్మెల్యే రాక


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

కమలాపురం : స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ. 1.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించడానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి బుధవారం హాజరు కానున్నారని మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప రోడ్డు వైపు నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో 16 గదులున్నాయని, వాటిని అతిథులు ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

పెండ్లిమర్రి : మండలంలోని పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనువాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. పాలక మండలి సభ్యులు, భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

నాడు-నేడు రెండవ దశ పనుల పరిశీలన


చిలంకూరులో పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు రెండవ దశ పనులను మంగళవారం రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ప్రాజెక్టు మానటరింగ్ అధికారి బుగ్గయ్య పరిశీలించి మాట్లాడారు. పనులలో నాణ్యతను కచ్చితంగా పాటించాలన్నారు. తర్వాత పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. చిలంకూరు, తిప్పలూరు గ్రామాలలోని పలు పాఠశాలలో పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఈఈ చంద్రశేఖర్, డీఈ సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ శివప్రసాద్, మండల ఇంజనీరు రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న ప్రజారక్షణ భేరి యాత్ర

కమలాపురం : ఈనెల 15న చలో విజయవాడలో భాగంగా చేపట్టిన ప్రజా రక్షణభేరి యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కామనూరు శ్రీనువాసులురెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కమలాపురంలో ప్రజా రక్షణభేరి యాత్ర వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అధికంగా జీతాలు ఇస్తామని చెప్పి నాలుగేళ్లు అవుతున్నా దిక్కు మొక్కు లేదన్నారు.

గ్యారేజి నుంచి వెళ్లే ప్రతి బస్సును చెక్ చేసుకోవాలి


వర్కర్స్‌కు సూచనలు ఇస్తున్న డిపో మేనేజర్

జమ్మలమడుగు : ఆర్టీసీ గ్యారేజి నుంచి బస్సులను బయటికి తీసుకెళ్లేటప్పుడు డ్రైవర్లు వాహనాల యొక్క కండీషన్‌ను తప్పని సరిగా చెక్ చేసుకోవాలని డిపో మేనేజర్ ప్రవీన్ తెలిపారు. మంగళవారం ఆయన డిపో గ్యారేజిలో ఉన్న సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఏమాత్రం బస్సు కండీషన్‌లో లేకపోతే ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతామనే భరోసా ప్రయాణికులకు కల్పించాలంటే డ్రైవర్లు తప్పని సరిగా తమ బస్సును పరిశీలించుకున్న తరువాతనే గ్యారేజి నుంచి బయటకు తీయాలన్నారు. కార్యక్రమంలో గ్యారేజి ఇన్‌చార్జి కంబగిరిస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి

చక్రాయపేట : ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడిగా ఎం.జనార్దన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వేంపల్లెలో నిర్వహించిన ఎస్టీయూ రీజియన్ సమావేశంలో చక్రాయపేట మండల నూ తన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కుళాయిబాబు, ఆర్థిక కార్యదర్శిగా గంగాధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి తెలిపారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా జి.శివారెడ్డి, ధర్మారెడ్డి, దాదాపీర్, రామమోహన్‌రెడ్డి, అమీర్‌బాషా, సుబ్రమణ్యంలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు సంఘ బలోపేతం, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి నిరతరకృషి చేస్తామని వారు తెలిపారు.

2024 ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- జగనన్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ప్రతి కుటుంబం రూ.9 లక్షలు లబ్ధిపొందుతోంది
- మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి


హాజరైన నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు

పులివెందుల రూరల్/టౌన్ : 2024 ఎన్నికలకు ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని మంగళవారం భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని, ఆ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు సైనికుల్లాగా పనిచేయాలన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ప్రతి కుటుంబం రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షలు లబ్ధి పొందుతున్నారన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తెలుసుకునే విధంగా, ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండేవిధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేస్తే ముఖ్యమంత్రి కోరిక మేరకు రాష్ట్రంలో 175 స్థానాలకు 175 సాధించవచ్చన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ సీఎం చేయడమే లక్ష్యమన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించినందుకు, 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసినందుకు జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారన్నారు. పులివెందుల ప్రాంతంలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా టీడీపీ నాయకుల కళ్లకు కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు రావాలి పుస్తకాలను విడుదల వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు విడుదల చేశారు. కార్యక్రమంలో వేముల మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, జడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డి, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబకపల్లె బాబు, చక్రాయపేట ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అజ్జుగుట్టు భాస్కర్‌రెడ్డి, రామ మల్లేశ్వరరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, చంద్రమౌళి, చంద్ర ఓబులరెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించండి

జమ్మలమడుగు : ఎస్సీ వర్గీకరణ కోసం తమకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని మాదిగ దండోర నాయకులు మంగళవారం కలసి వినతిప్రతం అందజేశారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం చేస్తున్నామని ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభ విజయవంతానికి సహకరించాలని వారు ఆయనను కోరారు.

అధిక ఫీజు వసూళ్లు ఆపాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల ఫీజుపేరుతో అధికంగా వసూలు చేస్తున్నారని విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం రూ. 125 వసూలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ జిల్లా లోని కడప, పొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ప్రాంతాలలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల వద్ద నుంచి రూ. 5 వందల నుంచి వెయ్యి వరకు ఫీజును వసూలు చేస్తున్నారన్నారు. చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవండి


మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష పథకం అధికారి ప్రభాకర్‌రెడ్డి

వేముల : ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చని జిల్లా సమగ్ర శిక్ష పథకం అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వేముల కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఇప్పటి నుంచే పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు తరగతి గది నుంచే రూపుదిద్దుకుంటుందన్నారు. ప్రతి విద్యార్థి తాము చదివే పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తీసుకువచ్చేలా చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా డెమో ద్వారా పిల్లలకు పాఠాలు నేర్పించాలని సూచించామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు ఆటలు, పాటలు, క్రీడల వంటి రంగాల్లో ప్రావీణ్యం పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

ముఖ్యంగా ఇంగ్లీషుపై ప్రతి విద్యార్థి పట్టు సాధించేందుకు జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రభుత్వం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను ఇవ్వడం జరిగిందన్నారు. రాబోవు 10వ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులందరు ఇప్పటి నుంచే కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. విద్యార్థులు నిజజీవితంలో రాణించాలంటే మార్కుల్లో గ్రేడ్‌లే ప్రామాణికం కాదని, ఆసక్తి, సాధన, కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఇందుకు విద్యార్థులందరు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కెజీబీవీ ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో 20 గొర్రెపిల్లలు మృతి


కుక్కలదాడిలో మృతిచెందిన గొర్రెపిల్లలు

తొండూరు : మండలంలోని పాలూరు గ్రామానికి చెందిన పుల్లిరుపు నడిపి ఓబయ్యకు చెందిన 20 గొర్రెపిల్లలపై మంగళవారు కుక్కలు దాడి చేయడంతో మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. రోజు మాదిరిగానే గొర్రెలను మేత కోసం కొండ ప్రాంతానికి తోలుకుని వెళ్లాడు. దీంతో పొదలో ఉన్న గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేయడంతో 20 గొర్రెపిల్లలు మృతి చెందాయని దాదాపు రూ.1.20 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. జరిగిన విషయాన్ని తహసీల్దార్‌కు, పశువైద్యాధికారికి తెలపగా వారు వచ్చి పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పాల ఉత్పత్తుల్లో కల్తీకి చెక్

- రూ.11 కోట్లతో ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు
- 9న సీఎం చేతుల మీదుగా ప్రారంభం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న స్టేట్ సెంట్రల్ ల్యాబ్

పులివెందుల రూరల్: పాల ఉత్పత్తుల్లో కల్తీకి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అత్యాధునిక పరికరాలతో కూడిన ల్యాబ్ ఏర్పాటు చేసి పాలలో నాణ్యతను పరిశీలించనున్నారు. ఈ నెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ ల్యాబ్ ప్రారంభించనున్నారు.

- పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని ఏపీ కార్ల్ భవనంలో సుమారు రూ.11కోట్లతో అత్యాధునిక స్టేట్ సెంట్రల్ ల్యాబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో పంపిణీ అవుతున్న పాలు, పాల ఉత్పత్తుల్లో కల్తీని గుర్తించేందుకు ఇక్కడ అధునాతన యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు. వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన పాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ల్యాబ్ పనులు ఈ నెల 9నాటికి పూర్తి చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజూ వేయి వరకు పరీక్షలు

స్టేట్ సెంట్రల్ ల్యాబ్ పూర్తయితే తక్కువ ఖర్చుతో ఏడాదికి 500 నుంచి 1000 వరకు పరీక్షలు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ మిల్క్, ఎనలైజర్ బ్యాక్టీరియా, సోమాటిక్ సెల్ ఎనలైజర్, ఎఫ్‌టీఐ ఆర్ సాంకేతికత, ఆధారిత పాలవిశ్లేషణ పరికరం, ట్రిపుల్ ట్యాడ్రపుల్ మాస్ డిటెక్టర్‌తో ఎస్‌సీఎంఎస్ ఎఫ్ఐడీతో జీసీ ఎస్‌ఎంఎస్, సోడియం పొటాషియం ఎనలైజర్‌తోపాటు పది రకాల పరికరాలు అందుబాటులో ఉంచి నాణ్యతను పరిశీలిస్తారు. పాల ఉత్పత్తుల్లో పురుగు మందుల అవశేషాలు, యాంటీబయోటిక్, పశువైద్య అవశేషాలు, భారీ లోహాలు, వ్యాధికి కారణాలు గుర్తించవచ్చు. ఇందుకోసం సుమారు 15 మంది నిపుణులను నియమించనున్నారు. తద్వారా పాల సహకార సంఘాలు, పాడి రైతులకు, వాటాదారులకు మేలు జరగనుంది.

ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవం


ధ్వజ స్తంభం వద్ద హారతి ఇస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పట్టణ పరిధిలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో జరుగుతున్న ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవాలకు మంగళవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, ధ్వజ ప్రతిష్ట దాత ఆహ్వానం మేరకు హాజరైన ఎమ్మెల్యే ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రాకను పురస్కరించుకుని ఆహ్వానితులు పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చుతూ, డప్పు వాయిద్యాలతో, పూర్ణ కుంభంతో, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువ కప్పి, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అయ్యప్ప మాల ధారణ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్నా' కార్యక్రమం

వల్లూరు : మండల పరిధిలో గురువారం నుంచి మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 9 వ తేదీన లేబాక గ్రామ సచివాలయ పరిధిలో, 10న కొప్పోలు గ్రామ సచివాలయం, 14న దుగ్గాయపల్లె గ్రామ సచివాలయం, 15న దిగువపల్లె గ్రామ సచివాలయం, 16న కోట్లూరు గ్రామ సచివాలయం, 17న వల్లూరు గ్రామ సచివాలయం, 20న పైడికాలువ గ్రామ సచివాలయం, 21న తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయం, 22న తప్పెట్ల గ్రామ సచివాలయం పరిధిలలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శబరిమలైకి ప్రత్యేక బస్సు సర్వీసులు


మాట్లాడుతున్న ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి శబరిమలైకి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని, కావాల్సిన అయ్యప్ప భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్తీక మాసాల్లో శైవక్షేత్రాలకు కూడా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి యాగంటి, మహానంది, నందవరం, ప్రొద్దుటూరు రామేశ్వరం, కన్యతీర్థంకు కార్తీక మాసంలో ప్రతి సోమవారం బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. పెద్దలకు అయితే రూ.550లు, పిల్లలకు రూ.300లు టిక్కెట్ ఉంటుందన్నారు. అలాగే శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ కిలోమీటర్‌పై రూ.5లు తగ్గించడం జరుగుతుందన్నారు. సూపర్ లగ్జరీకి కిలోమీటర్‌కు రూ.62లు ఉండేదని, రూ.52లకే బస్సు సర్వీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పులివెందుల ప్రాంతంలోని పొలతల, భానుకోట, కోనమల్లేశ్వర కోన, శనేశ్వర కోనలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్తే ఇతర రాష్ట్రాల్లో ట్యాక్స్ కట్టాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే ఎటువంటి ట్యాక్స్ చెల్లించాల్సి ఉండదన్నారు. కార్యక్రమంలో ఎస్టీఐ కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆశా డే సమావేశం


మాట్లాడుతున్న జిల్లా మాస్ మీడియా అధికారిణి భారతి

వేంపల్లె: సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని జిల్లా మాస్ మీడియా అధికారిణి భారతి అన్నారు. తాళ్లపల్లె పీహెచ్‌సీలో డాక్టర్ స్వాతిసాయి ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోజూ లాగిన్, లాగౌట్ చేయాలని, గర్భిణులకు 12 వారాల్లో నమోదుపై హైరిస్క్ గుర్తించి చికిత్స అందించవచ్చునన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఆసుపత్రుల గుర్తింపు రద్దు, మూడేళ్లపాటు జైలు శిక్ష, రూ.10వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు నిజాముద్దీన్, సీహెచ్‌ఓలు వెంకటరత్నం, మౌనికమ్మ, షఫీవున్నీషా పాల్గొన్నారు.

హెల్త్ సర్వేపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

సింహాద్రిపురం: మండలంలోని బిదినంచెర్ల ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో హెల్త్ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీ నుంచి ప్రజలకు అందే సేవలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవలపై వివరించారు. కార్యక్రమంలో నారాయణ, రమణమ్మ, డా.ఖాజాముద్దీన్, సుకుమార్, పద్మావతి పాల్గొన్నారు.

హాస్టల్ వార్డన్‌పై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హాస్టల్‌వార్డన్ మంగమ్మ భర్త మూడే సుధాకర్‌నాయక్‌పై పోక్సో నిర్భయ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్సీకాలనీలో ఆయన మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలోని ఖాజీపేటలో ఉన్న ప్రభుత్వ బాలికల ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థినుపట్ల హాస్టల్ వార్డన్ భర్త మూడే సుధాకర్‌నాయక్ వేధింపులకు గురిచేస్తున్నాడని వార్డన్ మంగమ్మకు విద్యార్థులు సమాచారం ఇచ్చిన వార్డన్ స్పందించకపోవడం దారుణం అన్నారు. ఉన్నతాధికారులు హాస్టల్ వార్డన్ మంగమ్మపై చర్యలు తీసుకోవాలన్నారు.

టపాసుల విక్రయంలో జాగ్రత్తలు పాటించండి


మాట్లాడుతున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : పట్టణంలో టపాసుల విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ పి.గన్నాథ్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో టపాసుల విక్రయదారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు.

దుకాణాలు ఏర్పాటు చేసుకున్నప్పుడు ప్రతి దుకాణం మధ్య ఖాళీ ఉండేటట్లుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇసుక నింపిన బకెట్లను, ప్రథమ చికిత్స బాక్స్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, విక్రయదారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


దోమల మందును కొట్టిస్తున్న సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య


తొండూరు : సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఊడవగండ్లలో దోమల నివారణ కొరకు మంగళవారం పైరత్రం పిచికారీ చేసి, ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు వైద్యాధికారిణి డాక్టర్ ముంతాజ్ తెలిపారు. మంచినీటి నిల్వలో పెరిగే అనాలసిస్ దోమ మలేరియా వ్యాధిని వ్యాపింప చేస్తాయన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. మురికినీటిలో వారానికి ఒకసారి కిరోసిన్, ఇంజన్ ఆయిల్ చల్లితే దోమలు పుట్టకుండా ఉంటాయన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ నీటిని వారానికి ఒకసారి మార్చి నింపుకుంటే దోమల బెడద ఉండదన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం


అనాథ వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

వేంపల్లె : పట్టణంలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం బండపల్లె పుల్లారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య, పుల్లారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్

చెన్నూరు : మండలంలోని కనపర్తి లేఅవుట్లో నిర్మిస్తున్న జగనన్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కనపర్తి లేఅవుట్లలో నిర్మించే జగనన్న గృహ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు వేగవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించిన హౌసింగ్ అధికారులు ఎప్పటికీ కప్పుడు రిపోర్టు తెప్పించుకుని పనులను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే ఆలస్యం అయిందని ఇకమీదట అలాంటి అలసత్వం లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. హౌసింగ్ డీఈ మాట్లాడుతూ ఇప్పటికే 670 పక్కా గృహాలలో 93 గృహాలకు స్లాబ్‌లు వేశారన్నారు. 352 గృహ నిర్మాణాలకు సంబంధించి స్లాబ్ లెవల్‌కు గోడలు వచ్చాయన్నారు. 218 ఇళ్లకు సంబంధించి బేస్ మట్టాలు పూర్తయ్యాయని ఇవన్నీ కూడా జనవరి ఫిబ్రవరి కల్లా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, హౌసింగ్ ఏఈ మేనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్ దూరం

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : క్యాన్సర్ కారకాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తే, ఆ వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్, కెరీర్ గైడెన్స్ సెల్, మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ×మహిళల ఆరోగ్య సమస్యల నివారణ× అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ శరీరంలో ఉన్న కణాల అభివృద్ధిలో విపరీత పెరుగుదలే క్యాన్సర్‌కు కారకమన్నారు. మారుతున్న జీవనశైలి వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. మొదటి, రెండవ స్టేజీలలో క్యాన్సర్ నయం కావడం సులువని, తర్వాత కష్టంగా మారుతుందన్నారు. శరీరంలో మార్పులు కనిపించగానే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడంలో వారధులుగా మారాలన్నారు. రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన ప్రముఖ జనరల్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డా. ఎం. పావని మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్‌కు గురయ్యే శరీరభాగాలు, వైద్యసౌకర్యాలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ డా. సుజాత మాట్లాడుతూ సంప్రదాయ జీవన విధానం సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమన్నారు. అనంతరం నోబుల్ ప్రైజ్ విజేత మేరీ క్యూరీ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను అతిథులు పరిశీలించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ డైరెక్టర్ డా. కె. లలిత, మైనార్టీ సెల్ డైరెక్టర్ డా. కె. రియాజున్నీసా, అధ్యాపకులు సరిత, మునికుమారి, సురేష్‌బాబు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి శివరాం తదితరులు పాల్గొన్నారు.